# దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా

అధికారం అండతో కూటమి నేతలు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ భూములను దర్జాగా ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే దాడులకు దిగుతున్నారు. దీంతో అధికారులు భయాందోళన చెంది మిన్నకుండిపోతున్నారు. ఈ క్రమంలోనే కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని బేవనపల్లి రెవెన్యూలో చేనేత కార్మికులకు ఇచ్చిన భూమిని ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకునే నాథుడు లేడు.

- యథేచ్ఛగా భవనాల నిర్మాణం
- ప్రశ్నిస్తే దాడులు చేస్తున్న అక్రమార్కులు
- బెంబేలెత్తుతున్న అధికారులు



పరిశ్రమలకు కేటాయించిన స్థలం ఇదే



కూటమి నేతలు దర్జాగా చేపట్టిన నిర్మాణాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని బేవనపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో సర్వే నంబర్ 110/1బిలో వున్న 1.25 ఎకరాల భూమిని గతంలో ఫ్యాక్టరీలకు కేటాయించారు. ఈ స్థలంలో చేనేత కార్మికులు పరిశ్రమలను నడుపుకునేవారు. కాలక్రమేణా చేనేత వస్త్రాలకు ఆదరణ తగ్గడంతో పరిశ్రమలు మూతపడ్డాయి. అప్పటి నుంచి ఈ భూమి ఖాళీగా వుంది. ప్రస్తుతం భూముల ధరలకు రెక్కలు రావడంతో వాటిపై టీడీపీ నేతల కన్నుపడింది. ఆక్రమించుకునేందుకు ప్రయత్నాలు చేసినా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అడ్డుకట్ట వేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నేతలకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది. ఇండస్ట్రియల్ స్థలంపై కన్నేశారు. దర్జాగా ఆక్రమించుకుని భవనాల నిర్మాణం చేపడుతున్నారు. ఇప్పటికే వడ్డిపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు నేతలు భవనాలు నిర్మించారు. మరికొందరు కూడా భూమిని ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. భూముల ఆక్రమణపై ప్రశ్నించిన వారిపై బెదిరించడం, వినకపోతే భౌతికదాడులకు సైతం దిగుతుండడంతో స్థానికులు మిన్నకుండిపోతున్నారు. రెవెన్యూ అధికారులు సైతం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. రికార్డులు లేకుండా కట్టడాలు నిర్మించడం నేరమని, తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు చెబుతున్నా ఆచరణలో విఫలమవుతున్నారు.

## క్లుప్తంగా

### పూజగానిపల్లె రోడ్డును బాగుచేయండి



పుంగనూరు మండలం పూజగానిపల్లెలో గుంతలు పడిన రోడ్డు

పుంగనూరు: గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లను బాగు చేయాలని ఎస్సీ, ఎస్టీ జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ బాణావత్ మునీంద్రనాయక్ కోరారు. ఆయన బుధవారం పూజగానిపల్లె, పొలెంపల్లె, రాగానిపల్లె ప్రాంతాల్లోని అధ్వానంగా వున్న రోడ్లకు మరమ్మతులు చేయాలని అధికారులకు విన్నవించారు.

### గర్భిణులకు సామూహిక సీమంతాలు



గర్భిణులకు సీమంతాలు చేస్తున్న సీడీపీవో వాణిశ్రీదేవి

రొంపిచెర్ల: మండలంలోని మోటుమల్లె పంచాయతీలోని పాళ్యం నగిరి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. సీడీపీవో వాణిశ్రీదేవి మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా ప్రతి నెలా వైద్య పరీక్షలు చేసుకోవాలన్నారు. ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష, అంగన్‌వాడీ కార్యకర్తలు సరస్వతి, నిర్మలమ్మ, శోభ, హైమావతి, భవిత తదితరులు పాల్గొన్నారు.

### మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి



సదుం: అవగాహన కల్పిస్తున్న అధికారులు

సదుం: ప్రతి మహిళా తనతో పాటు కుటుంబ సభ్యుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జోగివారిపల్లె సర్పంచ్ అనితాకుమారి తెలిపారు. స్థానిక సచివాలయంలో బుధవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కింద మహిళలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది నీలకంఠ, జానకి, శిఖామణి పాల్గొన్నారు.

### నేడు మద్యం, మాంసం విక్రయాలు నిషేధం

పలమనేరు: గాంధీ జయంతిని పురస్కరించుకుని గురువారం పలమనేరు మున్సిపాలిటీలో మద్యం, మాంసం విక్రయాలను నిషేధించినట్టు కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. ఎవరైనా అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సామాజిక పింఛన్లను బుధవారం వందశాతం పంపిణీ చేసినట్టు తెలిపారు.

## పిచ్చికుక్క కరిచి బాలికకు గాయాలు

చౌడేపల్లె: మండలంలోని పరికిదొన పంచాయతీ చిన్నకంపల్లెలో బుధవారం పిచ్చికుక్క కరవడంతో బాలిక తీవ్రంగా గాయపడింది. స్థానికుల కథనం మేరకు.. చిన్నకంపల్లెకు చెందిన చంద్ర కుమార్తె మానస(10) ఇంటి వద్ద ఆడుకుంటూ వుంది. అటువైపు వెళ్తున్న పిచ్చికుక్క ఉన్నట్టు బాలికపై దాడి చేసింది. తీవ్రంగా గాయపడిన బాలికను కుటుంబ సభ్యులు పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గ్రామాల్లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఏరియా ఆస్పత్రి తనిఖీ

పుంగనూరు: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని బుధవారం డీసీహెచ్ఎస్ డాక్టర్ పద్మాంజలి తనిఖీ చేశారు. పరిసరాల్లో పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలు, మందుల నిల్వలను పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కింద చిత్తూరు జిల్లా వ్యాప్తంగా 41,798 మంది మహిళలకు వైద్య పరీక్షలు చేసినట్టు తెలిపారు.

# జీఎస్టీ తగ్గింపుతో రైతులకు మేలు



పలమనేరు: జీఎస్టీ తగ్గింపుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పలమనేరు/పెద్దపంజాణి/పుంగనూరు/సదుం/కుప్పం/చౌడేపల్లె /గుడుపల్లె/బైరెడ్డిపల్లె : ఇటీవల కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిందని, దీని వల్ల వ్యవసాయరంగానికి మేలు చేకూరిందని పలమనేరు జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, పలువురు ఎంపీడీవోలు, వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. పలమనేరు, పెద్దపంజాణి, పుంగనూరు, సదుం, కుప్పం, చౌడేపల్లె, గుడుపల్లె, బైరెడ్డిపల్లి మండలాల్లో బుధవారం జీఎస్టీ తగ్గింపుపై రైతులకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ గతంలో వ్యవసాయ పరికరాలు, యంత్రాలపై 12 శాతం జీఎస్టీ ఉండేదని, ఇప్పుడు 5 శాతానికి తగ్గిందన్నారు. దీంతో వ్యవసాయ యంత్ర పరికరాలతోపాటు పురుగు మందులు, బయో కెమికల్స్ తదితరాల ధరలు తగ్గాయన్నారు. జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించి, దుకాణాల వద్ద తగ్గింపు ధరలకు సంబంధించి బోర్డులు ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. పలమనేరులో జరిగిన కార్యక్రమంలో డీఎల్‌డీవో రామచంద్రయ్య, ఎంపీపీ రోజా, ఏవో సంధ్య, పెద్ద పంజాణి ఎంపీడీవో బాలాజి, ఏవో హేమలత, శంకర్రాయలపేట సర్పంచ్ హరినాథ్, పుంగనూరులో ఏడీ శివకుమార్, వెటర్నరీ ఏడీ మనోహర్, ఏఎంసీ చైర్మన్ శమీపతి, సింగిల్‌విండో చైర్మన్ రమణ, ఏవో రాధ, సదుంలో ఎంపీడీవో రాధారాణి, కుప్పంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, ఏవో ఫయాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, చౌడేపల్లెలో ఇన్‌చార్జి ఎంపీడీవో షబ్బీర్ అహ్మద్, ఏవో మోహన్‌కుమార్, పశువైద్యాధికారి డాక్టర్ దినేష్‌రెడ్డి, ఏఈవో శివశంకర్, గుడుపల్లెలో సింగిల్‌విండో చైర్మన్ రమేష్, ఏవో రాజ్యలక్ష్మి, తహసీల్దార్ సీతారామ్, బైరెడ్డిపల్లెలో ఏడీ గీతాకుమారి, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.





సదుం: వెటర్నరీ స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో, గుడుపల్లె : వ్యవసాయ పరికరాలపై రైతులకు అవగాహన



## కనుల పండువగా రథోత్సవం

బైరెడ్డిపల్లె: దసరా ఉత్సవాల్లో భాగంగా మండలంలోని రామచంద్రస్వామి ఆలయంలో బుధవారం రథోత్సవం కనుల పండువగా సాగింది. విశేషంగా అలంకరించిన రథంపై సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రస్వామి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి గ్రామంలో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించారు.

## సమసిన దోబీఘాట్ వివాదం

రొంపిచెర్ల: మండల కేంద్రమైన రొంపిచెర్ల పంచాయతీ నగిరిమడుగువారిపల్లి వద్ద నెలకొన్న దోబీఘాట్ వివాదం బుధవారం తహసీల్దార్ అమరనాథ్ జోగ్యంతో సమసిపోయింది. దోబీఘాట్ స్థలాన్ని అగ్రవర్ణాల వారు ఆక్రమించుకుంటున్నారని రజకులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో తహసీల్దార్ అమరనాథ్, వీఆర్వో శ్రీనివాసులు, సర్వేయర్ పోలీసు బందోబస్తుతో దోబీఘాట్‌ను పరిశీలించారు. గతంలో రజకులు ఇచ్చిన 40సెంట్ల భూమిని కొలతలు వేశారు. అందులో వున్న పశువుల దొడ్లు, పేడదిబ్బలు, గడ్డివాములను తొలగించి రజకులకు అప్పగించారు. రజక సంఘం నాయకులు నాగభూషణం, డాక్టర్ ఎం.వి.రమణ, వెంకటరత్నం, సుబ్రమణ్యం, రమణ, సిద్దయ్య, గుర్రప్ప, యోగానంద, యోగేష్, సునీల్, రాధ, భార్గవి, నిర్మల పాల్గొన్నారు.

## వృద్ధులను గౌరవిద్దాం



వయోవృద్ధులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ యుగంధర్

పలమనేరు: వయోవృద్ధులను గౌరవించాల్సిన అవసరం నేటి సమాజంపై ఉందని స్థానిక ఏరియా ఆస్పత్రి వైద్యులు యుగంధర్ తెలిపారు. స్థానిక ఆస్పత్రిలో బుధవారం అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. వయోవృద్ధులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. 150 మందికిపై హాజరై పరీక్షలు చేయించుకున్నారు. డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ సాధారణంగా వయసుమీరిన తర్వాత అనారోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. వృద్ధులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. కుటుంబ సభ్యులు వృద్ధులకు ఆసరాగా నిలవాలని పేర్కొన్నారు.

## మేకపిల్లలను ఎందుకు చంపుతున్నట్టు!

పలమనేరు: బైరెడ్డిపల్లి మండలం కుప్పనపల్లికి చెందిన ఓ యువకుడు ఇటీవల పొందు మేకల పాకలో వున్న 16 మేక పిల్లలను బండకేసి కొట్టి చంపిన విషయం ఆలస్యంగా వెలుగుచూసిన విషయం తెలిసిందే. అంతకు ముందు కూడా ఒక రైతు మేకను చంపినట్టు గ్రామస్తులు తెలిపారు. అప్పట్లో గ్రామపెద్దలు జరిమానా విధించినట్టు తెలిసింది. ఇలా ఉండగా మేక పిల్లలను ఆ యువకుడు ఎందుకు చంపుతున్నాడనే విషయం ఆ మండలంలో చర్చనీయాంశమైంది. మేక మాంసాన్ని వదిలిపెట్టి దాని వృషణాలను మాత్రమే తీసుకెళ్లి తినడం అతనికి అలవాటుగా మారిందని, అందువల్లే ఇలా చేస్తున్నాడన్న మాట వినిపిస్తోంది. ఏది ఏమైనా పోలీసుల విచారణలో అసలు విషయం బయటకు రావాల్సి ఉంది.

# నూతన వధూవరులకు ఆశీర్వాదం



సదుం: నూతన వధూవరులతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

సదుం: మండలంలోని తిమ్మానాయనపల్లె పంచాయతీ దిగువ కురవపల్లెకు చెందిన మాజీ సర్పంచ్ ప్రమీల, రమణ దంపతుల కుమార్తె ప్రసన్న వివాహం బుధవారం టీటీడీ కల్యాణ మండపంలో జరిగింది. ఇందులో వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో సర్పంచ్ మురళీరెడ్డి పాల్గొన్నారు.

# పెద్దిరెడ్డి కుటుంబానికి అండగా ఉంటాం



రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డిని కలిసిన జెడ్పీటీసీ రెడ్డీశ్వర్ రెడ్డి



మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన రొంపిచెర్ల వైఎస్సార్‌సీపీ నేతలు





ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ పవిత్ర, నాయకులు

రొంపిచెర్ల: మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని జెడ్పీటీసీ రెడ్డీశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు చెంచురెడ్డి తెలిపారు. వారు బుధవారం తిరుపతిలో రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్ సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తోందని దుయ్యబట్టారు. చింతల ద్వారకనాథరెడ్డి, గుండ్లూరి రామచంద్రారెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, శ్రీనాథనాయుడు, సురేంద్రరెడ్డి, సిద్ధరామిరెడ్డి, చంద్రమౌళి రెడ్డి, శేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఎంపీ మిథున్‌రెడ్డిని కలిసిన వైఎస్సార్ సీపీ నేతలు

పలమనేరు: ఇటీవల బెయిల్‌పై విడుదలైన రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని బుధవారం తిరుపతిలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు కలిశారు. వారిలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ పవిత్ర, పలమనేరు, బైరెడ్డిపల్లి మాజీ ఎంపీపీలు రాజేంద్రన్, ఆర్ శ్రీనివాసులురెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ, జిల్లా కార్యదర్శి సుహేబ్ తదితరులు వున్నారు.

# నేడు మున్సిపాలిటీ కార్యాలయంలో గాంధీ జయంతి

పుంగనూరు: స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో గురువారం ఉదయం 8.30 గంటలకు గాంధీ జయంతిని నిర్వహించనున్నట్టు కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా కార్యాలయ ఆవరణలో వున్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొననున్నారని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది రావాలని కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

# శత్రు సంహారిణి మాతా దుర్గా













వి.కోట: ప్రత్యేక అలంకరణలో దుర్గామాత, పుంగనూరు: మహిషాసుర మర్దినిగా పార్వతిదేవి, విరూపాక్షి మారెమ్మ, గంగవరం మలాలమ్మ, పెద్దపంజాణి కాళికాదేవి, బైరెడ్డిపల్లె: కాళికామాతగా సల్లాపురెమ్మ

**పలమనేరు, పుంగనూరు, కుప్పం నియోజకవర్గాల్లో దసరా ఉత్సవాలను ఘనంగా జరుపుకుంటున్నారు. అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. అమ్మవార్లను వేర్వేరు అవతారాల్లో అలంకరించి భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. ఉభయదారుల ఆధ్వర్యంలో అన్నదానం చేస్తున్నారు. తీర్థ ప్రసాదాలు పంపిణీ చేస్తున్నారు.**

సదుం: జాండ్రపేట రామలింగ చౌడేశ్వరీదేవికి బుధవారం విజయదశమి అలంకారం చేశారు. సదుంలోని సదుమమ్మ మహిషాసుర మర్ధినిగా చంద్రప్రభ వాహనంపై దర్శనమిచ్చారు. బెస్త సంఘం వారు ఉభయదారులుగా వ్యవహరించారు. పచ్చార్లమాకులపల్లెలో గంగాపురమ్మకు ప్రత్యేక పూజలు చేశారు.

**మహిషాసుర మర్ధినిగా పార్వతిదేవి**

పుంగనూరు: పట్టణంలోని భోగనంజుడేశ్వర స్వామి ఆలయంలో వున్న పార్వతిదేవి, కన్యకాపరమేశ్వరి, విరూపాక్షి మారెమ్మ అమ్మవార్లను బుధవారం మహిషాసుర మర్ధినిగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శత్రు బాధల నుంచి తప్పించాలని ప్రార్థించారు.

**మహిషాసుర మర్ధినిగా మలాలమ్మ**

గంగవరం: మండలంలోని మేలుమాయి క్రాస్ వద్ద వెలసిన మలాలమ్మ బుధవారం మహిషాసుర మర్ధినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త చంద్రప్ప ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

**శ్రీలలితా త్రిపురసుందరిగా ముత్యాలమ్మ**

రొంపిచెర్ల: రొంపిచెర్లలో వెలసిన ముత్యాలమ్మ బుధవారం శ్రీలలితా త్రిపురసుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులు చంద్రశేఖర్, కోమల కుటుంబ సభ్యులు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

**మహిషాసుర మర్ధినిగా అమ్మవార్లు**

వి.కోట: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి, దుర్గాదేవి అమ్మవార్లు బుధవారం మహిషాసుర మర్ధినిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు తరలివచ్చి పూజలు చేశారు.

**పెద్దపంజాణిలో..**

పెద్దపంజాణి: మండలంలోని శివాడి గ్రామంలోని కాళికాదేవి బుధవారం మహిషాసుర మర్ధినిగా భక్తులకు దర్శనమిచ్చారు. శివాడి దళిత వాడ గ్రామస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు.

**పలమనేరులో..**

పలమనేరు: పట్టణంలోని పాతపేటలో వెలసిన దుర్గాదేవి అమ్మవారు బుధవారం మహిషాసుర మర్ధినిగా భక్తులను అనుగ్రహించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

**బైరెడ్డిపల్లెలో..**

బైరెడ్డిపల్లె: దసరా ఉత్సవాల్లో భాగంగా బైరెడ్డిపల్లెలో వెలసిన బాటగంగమ్మ బుధవారం మహిషాసుర మర్ధినిగా, శ్రీకాళికామాతగా సల్లాపురెమ్మ భక్తులను అనుగ్రహించారు. అలాగే వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో విశేష పూజలు చేశారు.









పలమనేరు: మహిషాసుర మర్దినిగా దుర్గమ్మ, బైరెడ్డిపల్లె బాటగంగమ్మ, సదుం: రామలింగ చౌడేశ్వరీదేవి, రొంపిచెర్ల: శ్రీలలితా త్రిపురసుందరీ దేవిగా ముత్యాలమ్మ